యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

సర్వేనంబర్ 286 ప్రభుత్వ భూమిలోంచి మట్టి తవ్వకాలు జరపడంతో ఏర్పడిన భారీ గోతి

కంకర క్రషర్ కోసం వేసిన మట్టి కుప్పను టిప్పర్ల ద్వారా తరలించడతో ఏర్పడిన గుంత

- పాత కంకర క్రషర్ నుంచి రాత్రి టిప్పర్ల ద్వారా రవాణా
- మూడు నెలల నుంచి జరుగుతున్నా చర్యలు శూన్యం

జిన్నారం, ఏప్రిల్ 12 : రాళ్లకత్వ గ్రామ శివారులోని 286 ప్రభుత్వ భూమిలోంచి రాత్రిపూట మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. మూడు , నాలుగు ఇటాచీలతో తవ్వకాలు జరిపి పది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టిని శివనగర్ గ్రామ శివారులోని ఎల్ఈడీ పార్కు పరిశ్రమలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. శివనగర్ గ్రామానికి చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధుల రెండు టీమ్‌లు, రాళ్లకత్వ గ్రామానికి చెందిన కొందరు మరో రెండు టీమ్‌లుగా ఏర్పడి ఈ మట్టి దందాను సాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాళ్లకత్వ గ్రామం తరలించే వారు ఇక్కడి టీమ్ బాధ్యత, శివనగర్ గ్రామంలోకి వచ్చిన తరువాత ఆ గ్రామంలోని టీమ్‌లు బాధ్యత తీసుకొని నడిపిస్తున్నట్ల తెలిసింది. మూడు, నాలుగు నెలల నుంచి మట్టి తవ్వకాలు జరుపుతూ ప్రభుత్వ భూమిని పెద్ద పెద్ద గోతులుగా మార్చారు. కంకర క్రషర్ నిర్వహించిన మట్టి కుప్పను క్రమంగా తొలిగిస్తున్నారు. ఇప్పటికే పావు వంతు మట్టిని తరలించారు. ఒక్కోరోజు రాత్రి దాదాపు వంద టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసినా రాత్రి సమయం కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. 286 సర్వే నంబర్‌లో సుమారు 300 ఎకరాలకు పైనే ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోంచి దాదాపు 120 ఎకరాలు మైనింగ్‌కు కేటాయించారు. ఇన్నాళ్లు ఇక్కడ నడిచిన క్రషర్ ఇప్పుడు లేకపోవడంతో క్రషింగ్ కోసం ఏర్పాటు చేసిన భారీ మట్టి కుప్పలను క్రమంగా నేలమట్టం చేస్తున్నారు. దీనిని అదునుగా చేసుకొని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా తవ్వకాలు జరిపారు. దీని వెనక ఒక పెద్ద లీడరు హస్తం ఉన్నట్లుగా రాళ్ల కత్వ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు

రాళ్లకత్వ గ్రామ శివారులోని కంక ర క్రషర్ వద్ద నుంచి మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆర్ఐని పం పించాం. శివనగర్ గ్రామ శివారులోని పరిశ్రమలకు మట్టిని తరలిస్తున్నామని కొందరు తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. అవ సరమైతే పోలీసులు సహకారం తీసుకుంటాం.

– ఎం.భిక్షపతి, జిన్నారం తహసీల్దార్

పోరాట యోధుడు జ్యోతిబా పూలే

జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వలంటీర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాల అర్థశాస్త్ర, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. వెంకటేశం మాట్లాడుతూ అణగారిన వర్గాల విముక్తి కోసం జీవిత కాలం యుద్ధం చేసిన యోధుడు పూలే అని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీశ్వర్, వలంటీర్లు పాల్గొన్నారు.

13న డిగ్రీ అతిథి అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు నరహరి తెలిపారు. ఈ నెల 13న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 1.30 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఆత్మీయ సమ్మేళనాన్ని జిల్లాలోని అతిథి అధ్యాపకులందరూ తరలి రావాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జీఆర్ఎస్ నాయకులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 12 : ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు బీఆర్ఎస్ మండల నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు భాస్కర్, ప్రవీణ్ కుమార్, మారుతీయాదవ్, సిద్దారెడ్డి, ఉమేశ్‌పాటిల్ తదితరులు పాల్గొని సన్మానించారు.

గ్రామాల్లో చెట్ల నరికివేత

తాటిపల్లి శివారు నుంచి జహీరాబాద్ తరలుతున్న కలప లారీ

మునిపల్లి, ఏప్రిల్ 12 : మండలంలో పచ్చని చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా చెట్లను నరికి పర్యావరణానికి హాని తలపెడుతున్నారు. చెట్లను నరికివేయడంతో పాటు అడవుల్లోని చెట్లను తొలిగించి వ్యవసాయం చేస్తుండడంతో గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు నేలకూలుతున్నాయి. కలప వ్యాపారులు మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో దళారులను ఏర్పాటు చేసి తమ వ్యాపారాన్ని దర్జాగా కొనసాగిస్తున్నారు. తాటిపల్లి పోల్కంపలి, గోపులారం, బుస్సారెడ్డి పల్లి తదితర గ్రామాల్లో నిత్యం అక్రమంగా కలప నరికి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, వ్యాన్లు,లారీల్లో కలపను జహీరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. భూగర్భ జలాలను కాపాడడంతో పాటు అటవీ సంపదను రక్షించేందుకు రూపొందించిన వాల్టా చట్టం మునిపల్లి మండలంలో అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.ఈ చట్టం ప్రకారం అనుమతి లేకుండా చెట్లను నరికితే బాధ్యులకు భారీ జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. మండలంలో ఇష్టారాజ్యంగా కలప స్మగ్లింగ్ జరుగుతున్నా అటవీశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ఒక్క వాహనంపై, వ్యాపారిపై కాని సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని ప్రజలు, ప్రకృతి ప్రేమికులు ఆరోపిస్తున్నారు. కొందరు అటవీ సిబ్బంది, అధికారులు కలప వ్యాపారులతో కుమ్మక్కై మామూలు తీసుకుంటున్నారని, వారి నిర్లక్ష్యం కారణంగా అటవీ సంపద తరిగిపోతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఇష్టారాజ్యంగా సాగుతున్న చెట్ల నరికివేత, కలప రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం పోసేందుకు స్థలం ఏది ?

గురువన్నపేటలో సబ్ స్టేషన్ ముందు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ అధికారులు(ఫైల్)

కొమురవెల్లి, ఏప్రిల్ 12 : యాసంగి పంటకు రైతుల కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. నీళ్లు లేక వేసిన పంటలో సగం ఎండగా మిగతా సగం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పొద్దామనుకుంటే స్థలం లేని పరిస్థితి వచ్చింది. వివరాలకు వెళితే.. కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో ఇటీవల ఐకేపీ అధికారులు హడావిడిగా సబ్‌స్టేషన్ ఎదుట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ ధాన్యం పోసేందుకు స్థలం లేదని ముచ్చట మరిచారు. గతంలో గ్రామ శివారులో ఒక ప్రైవేటు వ్యక్తి స్థలంలో ధాన్యం ఆరబోసి కాంటా పెట్టేవారు. సదరు వ్యక్తి అట్టి స్థలంలో ధాన్యం పోయవద్దని చెప్పడంతో రైతులకు ధాన్యం పోసేందుకు స్థలం దొరకని పరిస్థితి నెలకొంది. గ్రామ శివారులో ఖాళీగా ఉన్న ప్రైవేటు వెంచర్ ఖాళీ స్థలం కొంత మంది రైతులు పోసిన ధాన్యంతో నిండిపోయింది. మిగతా 90 శాతం రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ పోయాలో అర్థం కాని పరిస్థితి ఉంది. దీంతో హడావిడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు ధాన్యం పోసేందుకు స్థల సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మనూరు, ఏప్రిల్ 12 : ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు సాగర్ శెట్కార్, మాజీ జడ్పీటీసీ నిరంజన్ అన్నారు. శుక్రవారం మనూరు మండల కేంద్రంలోని మాయికోడ్ చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శుభాష్ రావు పాటిల్, రాజు, మల్లేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

రోడ్లపై కాంక్రీట్ వ్యర్థాల పారబోత

పారిశ్రామిక వాడలోని పోలీస్‌స్టేషన్ రోడ్డు మార్గంలో పారబోసిన కాంక్రీట్ వ్యర్థాలు

బొల్లారం, ఏప్రిల్ 12 : రోడ్డు మధ్యలో రాకపోకలకు అడ్డంగా కాంక్రీట్ వ్యర్థాలను విచ్చలవిడిగా పారబోశారు. బొల్లారం పారిశ్రామిక వాడలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి మార్గంలో కాంక్రీట్ వ్యర్థాలను రాకపోకలకు అడ్డంగా పారబోయడంపై పారిశ్రామిక వాడ ప్రజలు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను రోడ్డుపై పోయడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. నిత్యం ప్రయాణాలు సాగించే రోడ్డుపై వ్యర్థాలను పారబోసిన సదరు పరిశ్రమను గుర్తించి చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడ ప్రజలు కోరుతున్నారు.

15తేదీ వరకు పరీక్ష ఫీజు గడువు

సదాశివపేట, ఏప్రిల్ 12 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2000-2016 సంవత్సరం వరకు సంబంధించి విద్యార్థులు, 2016-2019 వరకు సెమిస్టర్‌లో విధానంలో చదివిన విద్యార్థులు తమ సబ్జెక్టులో ఉత్తీర్ణత పొందకుండా ఏమైనా మిగిలి ఉంటే వాటి పరీక్ష కోసం అపరాద రుసుం లేకుండా ఈ నెల 15 వరకు ఫీజు చెల్లించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ తాడెపల్లి పతంజలి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత పత్రాలతో కళాశాలలో ఫీజు చెల్లించవచ్చన్నారు. పాత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు ఉస్మానియా విశ్వ విద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ ప్రచార రథం ప్రారంభం



రుద్రారం గణేశ్ దేవస్థానం వద్ద కాంగ్రెస్ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని సిద్ధి వినాయక దేవస్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార రథాలను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్‌లో నీలం మధు విజయం ఖాయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ బలం పెరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ పథకాలు ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. నీలం మధును గెలిపించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థిని మృతి

బేగరి చందన(ఫైల్)

కోహీర్, ఏప్రిల్ 12 : ప్రమాదవశాత్తు ఇంటర్ విద్యార్థిని విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. ఎస్సై కిష్ణయ్య కథనం ప్రకారం.. మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి చందన(16) శుక్రవారం విద్యుత్ షాక్ తగిలింది. చందన ఇంటిపై ఉన్న కరెంటు తీగల ద్వారా మెట్ల మార్గం గుండా విద్యుత్ సరఫరా అవుతున్నది. కరెంటు తీగలపై ఉండే రక్షణ కవచం పూర్తిగా తొలిగిపోయింది. దీంతో మెట్ల మార్గం గుండా ఉన్న ఇనుప చువ్వల వరకు విద్యుత్ సరఫరా జరిగింది. ఆమె ప్రమాదాన్ని గ్రహించలేదు. ఇంటిపైకి వెళ్తుండగా కరెంటు ఉన్న ఇనుప చువ్వలను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ దవాఖానకు తరలించారు. తండ్రి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. హత్నూర గురుకుల కళాశాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. సెలవులకు ఇంటికి రావడం, మృత్యువాత పడడంపై తోటి విద్యార్థులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు పటాన్‌చెరులో బీఆర్ఎస్ సమావేశం

పటాన్‌చెరు, ఏప్రిల్ 12 : నేడు పటాన్‌చెరులో బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశం పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమవేశానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరవుతారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, హాజరుకానున్నారు.

జోగిపేటలో బీజేపీ ఎన్నికల ప్రచారం

అందోల్, ఏప్రిల్ 12 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం జోగిపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు వ్యాపారులతో మాట్లాడి బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా హన్‌మాన్ ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి పూజలు చేశారు. నాయకులు ప్రభాత్ కుమార్, గాజుల నవీన్, భూమయ్య, రవిశంకర్, శివకుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో ప్రచారం చేస్తున్న బీబీ పాటిల్

కేసీఆర్ సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

చౌటకూర్, ఏప్రిల్ 12 : మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో సింగూరు చౌరస్తా వద్ద ఈ నెల 16న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభా స్థలాన్ని ఆపార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, పట్లోళ్ల జైపాల్‌రెడ్డి సభ స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ వేదిక, కళాకారుల వేదిక, వాహనాల పార్కింగ్‌తో పాటు సమావేశానికి హాజరయ్యే ప్రజలు, కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, నాయకులు మామిళ్ల రాజేందర్ ముదిరాజ్, కాసాల బుచ్చిరెడ్డి, మనోహర్‌గౌడ్, పట్లోళ్ల వెంకట్‌రాంరెడ్డి, మాణిక్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, న్యాత మాణయ్య, చిల్వేరి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కంది, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వాహనదారులు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఇంద్రకరణ్ పరిధిలోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. వివాహాల సామగ్రి కొనుగోలు, దవాఖాన అవసరాలకు సంబంధించి ఉంటే తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

క్లోర్, ఏప్రిల్ 12 : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన జల్లపల్లి మస్తుగొండ (33) క్లోర్ మండలం రాపర్తిలోని అత్తగారింటికి 10న బయలు దేరాడు. 161 నంబర్ జాతీయ రహదారిపై మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలో డివైడర్‌కు ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలతో హైదరాబాద్‌లోని గాంధీలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంగారెడ్డి మెయిన్ బ్రాంచ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

దిగువ **రుణగ్రహీతలు మరియు హామీదారుల** నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు బకాయి **రూ. 41,20,256.17 (నలభై ఒక్క లక్షల ఇరవై వేల రెండు వందల యాభై ఆరు రూపాయల పదిహేడు పైసలు మాత్రమే** -28.05.2023 వరకు విధించబడిన వడ్డీ) + వడ్డీ + ఇతర చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/చార్జ్ చేయబడిన, రీజనల్ ఆఫీస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "ఏది ఉంటే అది"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన సంగారెడ్డి మెయిన్ బ్రాంచ్, **30-04-2024**న విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆస్తి వివరాలు	రిజర్వు ధర	బయానా డిపాజిట్
ఆస్తి-1	రూ. 1,42,80,000/-	రూ. 14,28,000/-
ఆస్తి-2	రూ. 43,08,820/-	రూ. 4,30,882/-

రుణగ్రహీతలు: M/s. మోనీష్ ఫ్యూయల్ స్టేషన్, ప్రా. శ్రీమతి గంగుల లావణ్య, చిరునామా: 14-81/60/1, ప్లాట్ నం. 26, మల్లికార్జున నగర్, రాఘవేంద్ర కాలనీ బస్టాప్ ఎదురుగా, బీరంగూడ, అమీన్‌పూర్, సంగారెడ్డి. **కో-ఆబ్లిగెంట్/హామీదారు/తనఖాదారు : శ్రీ రాజ్ మాణిక్ రెడ్డి (ఎ. రాజిరెడ్డి) తండ్రి** జోగి రెడ్డి, చిరునామా: ఫ్లాట్ నం. 501, సుఖకార్త్త రెసిడెన్స్, పోతిరెడ్డిపల్లి, సంగారెడ్డి.

స్థిరాస్తుల తనఖాపెట్టిన ఆస్తి: ఆస్తి-1: సంగారెడ్డి టౌన్ మున్సిపల్ లిమిట్స్, మెదక్ జిల్లా, ఎ.పి., ఎంపిఐ సంగారెడ్డి, జడ్‌పిఐ మెదక్ ఎట్ సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ జిల్లా మెదక్ ఎట్ సంగారెడ్డి పరిధిలోని సంగారెడ్డి టౌన్, రాజంపేట్ వద్ద గల సర్వే నం. 387 లోని 560 చదరపు గజాల విస్తీర్ణపు నం.65 గల ఖాళీ ప్లాట్. **ఆస్తి సరిహద్దులు:** ఉత్తరం: ప్లాట్ నం. 64, దక్షిణం: ప్లాట్ నం.66, తూర్పు: ఇతరుల భూమి, పశ్చిమం: 40' వెడల్పు రోడ్డు. **ఆస్తి-2:** జి.పి. పోతిరెడ్డిపల్లి, రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా సంగారెడ్డి, రిజిస్ట్రేషన్ జిల్లా మెదక్ ఎట్ సంగారెడ్డి పరిధిలోని, తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, సంగారెడ్డి మండలం, పోతిరెడ్డిపల్లి గ్రామం వద్ద గల 105.95 చ.మీటర్లకు సమానంగా పిలువబడే 126.73 విస్తీర్ణపు సర్వే నం. 7లోని నం.2/భాగం గల ఖాళీ ప్లాట్. **ఆస్తి సరిహద్దులు:** ఉత్తరం: ప్లాట్ నం. 2/భాగం, దక్షిణం: ప్లాట్ నం.3, తూర్పు: ప్లాట్ నం. 13, 14, 14/A, పశ్చిమం: 20' వెడల్పు రోడ్.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు: తెలియవు

అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా **www.unionbankofindia.co.in, http://www.ibapi.in &** సర్వీస్ ప్రొవైడర్స్ వెబ్‌సైట్ అనగా **www.mstcecommerce.com**లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.

తేది: 12-04-2024 **అధీకృత అధికారి**

ప్రదేశం: సంగారెడ్డి

స్టాట్యుటరీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 30/15 రోజుల అమ్మకం ప్రకటన

పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/ హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇనహోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను " ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా" తేదీ: **23 ఏప్రిల్ 2024**న **మ. 12.30** గం. నుండి **మ. 3.30** గం. **మధ్య** (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర. సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్టూల బరువు	నికర బరువు
1	జహీరాబాద్	XXXXXXXXXX0099	కొలన్ నారాయణ రెడ్డి	157300	15-మార్చి-24	39.9	38.9

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ